# నన్ను కొంచెం కొరుక్కుతినవయ్యా!

- చందు సోంబాబు

**ఎటుచూసినా వెన్నెల కురుస్తోంది. రాజమందిరపు గవాక్షం దగ్గర నిలుచుని వున్నది రాజకుమారి మదనిక. ఉద్యానవనం కేసి చూస్తోంది. మత్తుగా ఒళ్ళు విరుచుకుంది. అర్ధరాత్రి. రాజమందిరంలో అందరూ ప్రశాంతంగా నిద్రపోతున్నారు. ఒక్క మదనికకు మాత్రమే నిద్ర రావడం లేదు. మెల్లగా వెనక్కి తిరిగింది. మనసులో తెలీని అలజడి. తడారిపోయిన పెదిమలను నాలుకతో తడిచేసుకున్నది మదనిక.**

ఏదో కావాలి! అది లభిస్తే ఏదో అయిపోవాలి. భారంగా నిట్టూర్చింది. ఆమె గుండెలదిరాయి. తెలీడం లేదు. ఏమీ తెలీడం లేదు. కానీ .... కానీ .... ఒళ్ళంతా వేడి సెగలు. సన్నని ఒణుకు.

ఉద్యానవనంలో అడుగుపెట్టింది. మెల్లగా అడుగులు వేస్తోంది.

కొలను గట్టున సేద తీరాలి!

నడుముని లయబద్ధంగా కదిలిస్తూ ఎక్కడలేని ఒయ్యారాలూ పోతూ కదులుతోంది మదనిక. రేరాణి, పున్నాగమల్లి పువ్వుల సౌరభాన్ని ఆమె గుండెల నిండా నింపుకున్నది.

మత్తుగా ఊపిరి పీల్చుకున్నది.

కొలను గట్టుదగ్గరకు చేరింది. వెన్నెల వానలో చిరుగాలి తెమ్మెరలు ఒకదాని వెంట ఒకటి పోటీ పడుతూ మదనికని తాకి ఉబ్బితబ్బిబ్బవుతున్నాయి.

మెల్లగా ఒళ్ళు విరుచుకుంది. ఆమె సన్నని నడుము చెరుకు విల్లులా వంగింది.

చుట్టూ ఓసారి కలియ చూసింది. ఎవరైనా తనని గమనిస్తున్నారేమోనని. అక్కడికి అతి సమీపంలో వున్న మామిడి చెట్టుని చూడడం మరచిపోలేదు. కొమ్మ కొమ్మనీ పరికించి చూసింది.

ఆమె కెందుకో నవ్వొచ్చింది. మునిపళ్ళతో కింది పెదవిని నొక్కి పట్టింది.

కొలను గట్టున ఓ కాలు జాపి మరో కాలు మడిచి కూర్చుంది.

నడుముపైన ఓ చేతిని వేసుకుని గట్టుపైన వున్న పచ్చికని మరో చేత్తో తెంపుతున్నది.

వెన్నెల జోరు వానలా కురుస్తోంది. ఉద్యానవనంలో చెట్లపైనించి వీచే చల్లని గాలికి పరవసించి పోవడానికి బదులు ఆమె శరీరంలో వేడి సెగలు పుడుతున్నాయి.

ఒంట్లో వేడి తగ్గాలి.

వెన్నెల రాత్రుల్లో ఒంటరిగా అలా రావడం మదనికకి పరిపాటి. కానీ ఈ సారే ఆమె మనసు ఇలా కాలుతోంది. క్రీగంట మామిడి చెట్టుకేసి చూసింది. కొమ్మ కొమ్మనీ, రెమ్మ రెమ్మనీ పరికించి చూసింది. అక్కడ తనకి కావల్సినదేదో ఆమెకి కానరాలేదు. కానీ ఆమెకి తెలీకపోతే కదా!

తనని పరికించి పరీక్షగా గమనించే రెండు కళ్ళు దాగుని వుంటాయని. ఆ కళ్ళు ఎవరివో కూడా మదనికకి తెలుసు.

అయినా ఎవరూ లేనట్టే ప్రవర్తిస్తుంది. అతన్ని ఆకర్షించాలనే తహతహ.

ఒంట్లో సెగలు తగ్గాలంటే సరస్సులో దిగి జలకాలాడక తప్పదు.

అంత మధురమైన రాత్రివేళ - అంతకంటే సమయమెక్కడిది?

పెదవులపై లాస్యం చేసిందో చిరునవ్వు. అప్పుడామె పెదవులు లక్ష ఒంకర్లు తిరిగాయి. బంగారు మలామాతో చేసినట్లున్న ఆమె చెంపలు సొట్టలు పడినయి. లేచి నిలబడింది.

మనసులో కలవరం!

ఎందుకు తనకీ తాపం?

యుక్త వయస్సు.

తన అందానికి ముగ్ధులైన ఎందరో రాజకుమారుల చిత్రపటాలని పంపారు. ఏ ఒక్కరూ నచ్చలేదు. అయితే తనెవర్నన్నా ప్రేమిస్తోందా!

మనసుకి నచ్చని వాడిని ఎలా పరిణయమాడగలదు?


కానీ అతను . . . . . మహారాజు ప్రశంసలు పొందిన ఆ వీరుడు . . . . .

అతి సామాన్యుడు. రాచకొలువులో పని చేసే ఓ వీరుడు. తన మనసులో అలజడికి కారణమైన తొలి పురుషుడు. అతని పేరు జయసింహ.

అతని ఊహల్లో కాలిపోతూ మధురమైన కలలు కంటూ, 'ఎంత హాయిలే హల'

ఈ వయసునీ, అందాన్నీ ఏదో ఒక రోజు అతనికే అర్పించాలి!

ఆ రోజెప్పుడొస్తుంది! అంత వరకూ ఆగేదెలా?



మనసు చంపుతోంది.

ఒళ్ళు కాలిపోతోంది! మామిడి చెట్టు కేసి చూసింది. అతను అక్కడ వున్నాడనే ఆశ!

మోహన సముద్రపు అలల్లా ఆమె ఆలోచనలు. . . . .

ఇంత అందమైన ఉద్యానవనంలో వెన్నెల రాత్రిలో, పున్నాగమల్లి సువాసనల గుబాళింపుల మధ్య తమకంతో వున్న తనని ఆర్తిగా కౌగిలిలోకి తీసుకోడానికి ఆ వీరుడొస్తే . . . . . .?

ఆశగా చుట్టూ కలయ చూసింది.

నిస్పృహతో నిట్టూర్చింది.

ఒంటిపైని వస్త్రాలని ఒలిచిగట్టుపై వుంచింది. వక్షోజాలపైన సన్నని నునుపైన వస్త్రాన్ని చుట్టుకుని ముడివేసింది. పిరుదల చుట్టూ కూడా వస్త్రాన్ని చుట్టుకుని బొడ్డుకిందగా దోపుకుంది.

అలవోకగా నీళ్ళలోకి చేపపిల్లలా జారింది. అలసిపోయేంత వరకూ జలకాలాడి గట్టుపైకి చేరింది. ఓ కాలుని మడిచి మరో కాలుని అరజాపి తలకిందగా చేతిని పెట్టుకుని యక్షకన్యలా పడుకుంది.

కోలమొహం. పెద్ద కళ్ళు.

సన్నని కనుబొమలు, చిన్న నోరు. చూడగానే చప్పరించాలనిపించే ఎర్రని పెదిమలు. చెక్కిళ్ళలో నవరత్నాల కాంతి పుంజాలు. ఆమె బరువుగా ఊపిరి తీసి ఒదులుతుండడం చేత ఆమె ఎద పొంగులు పైకి కిందకీ కదులుతున్నాయి. ఆచ్ఛాదన కోసం కట్టుకున్న వస్త్రపు ముడి విడిపోయి ఎద పొంగులు బయటపడినయి. ఆ జంట నారింజలకి ముందు రెండు నల్లని ద్రాక్షలు అతికించినట్టు . . . . .

అలసి పోయిన ఆమె కనురెప్పలు మూతలు పడినయి.

ఆమె ఊహ నిజమే!

కొలనుకి అతి సమీపంలో వున్న మామిడి చెట్టు గుబురు కొమ్మల మధ్య కూర్చుని రాకుమారి అందాలనీ, చందాలనీ, ఆమెలోని ఎత్తుపల్లాలనీ, శిఖరాలనీ, గుట్టలనీ, లోయలనీ తనివితీరా, కనులారా చూస్తూ అమరలోకంలో వున్న భ్రాంతిలో వున్నాడా వీరుడు.

రాకుమారి మనసుని చెదరగొట్టిన వాడే ఆ వీరుడు. అతని కోసమే ఆమె కలియజూసింది.

సాహసమే కావచ్చు! అలాంటిచోట ఆ సమయంలో ఎవరైనా తనని గమనిస్తే శిరచ్ఛేదం తప్పదని అతనికి తెలుసు. కానీ మనసు, వయసూ వూరుకుంటాయా?

రాకుమారంటే అతనికి ఎంతో ఇష్టం. ప్రాణం...

కానీ ఆమె రాకుమారి!

తనో సాధారణమైన సైనికుడు.

అసాధారణమైన ఆమె అందాన్ని చూసి తరించడమే తప్ప తన అనుభవంలోకి తీసుకోలేనన్న సత్యం అతనికి తెలుసు.

ఆమెని పొందని బతుకు ఎందుకు ?

వెన్నెల రాత్రుల్లో ఆమె అక్కడికి వస్తుందని తెలుసు. సాహసంతో ఉద్యానవనంలో ప్రవేశించి ఆమె అందాలని చూసి తరించిపోతుంటాడు.

ఆమె తనని వరిస్తుందా?

తనలో ఏముంది?

తను రాకుమారుడు కాదు.

కానీ ఓ మగాడిగా అన్ని గుణాలూ మంచివే.

మహారాజుగారి ప్రశంసలు పొందిన వీరుడ తను.

అలాని రాకుమారిని ప్రేమిస్తే ఊరుకుంటారా?

మరణ శిక్ష తప్పదు.

తనని తాను నిరూపించుకోవాలి. రాకుమారికి తగిన వాడినని నిరూపించుకోవాలి.

రాకుమారి మదన సామ్రాజ్య పీఠాన్ని దక్కించుకోవాలి.

చెట్టుదిగి వెళ్ళి రాకుమారి ఎదురుగా నిలబడి తన ప్రేమ సందేశాన్ని వినిపించాలి!

అంత అవకాశాన్ని ఆమె తనకి ఇస్తుందా?

చావుకి తెగిస్తే రాకుమారి లభిస్తుందేమో!

అన్నీ ఆశలే! జరిగిందేమిటి?

ఓ పక్క రాకుమారి పరిస్థితి అతనికి అర్థం అవుతోంది. ఆమె విరహాగ్నితో రగిలిపోతున్న సంగతిని చూపుల్లోనే గమనించాడు.

ఆ విరహ వేదన ఎవరి కోసం?

రాకుమారి మదనిక లేచి ఓసారి ఒళ్ళు విరుచుకుంది.

ఒయ్యారాలు పోతూ రాజమందిరంవేపు కదులుతోంది.

ఇలా జరిగింది ఈ రోజే కాదు. వెన్నెల రాత్రుల్లో రాకుమారి ఉద్యానవనంలోకి అలా ఒంటరిగా రావడం పరిపాటే. కానీ ఆమెలో కలిగిన స్పందన మాత్రం ఇదివరలో అతను చూడలేదు.

జయసింహ చెట్టు దిగాడు. అతనికి ఎంతో నమ్మకం. ఆమె తన ప్రణయదేవతని.

అడుగులో అడుగువేస్తూ కొలను దగ్గరకి నడిచాడు. రాకుమారి నడిచివెళ్ళిన దారిలో . . . .

వెన్నెలలో ఆమె పాద గుర్తులు. మెల్లగా నేల పైకి ఒంగాడు. ఆమె పాదాల గుర్తుల మీద అరచేతో నిమిరి పెదవులతో ముద్దాడాడు. అది చాలదా?

అతని చర్యని రాకుమారి గమనిస్తే జరగబోయేది?

ప్రళయమో!

ప్రణయమో!

****

మామిడి చెట్టు కొమ్మకి కాసి దోరగా పండిన మామిడి కాయ అదే కొమ్మపైన ఆదమరచి నిద్రిస్తున్న రామచిలుకని చూసి అన్నది కదా!

"నేను పుట్టింది మొదలు నిన్ను చూస్తూనే వున్నాను. నీ చర్యలన్నీ గమనిస్తూనే ఉన్నాను. ఓ రామచిలుకా! నువ్వెంత చిలిపి వాడివో నాకు తెలుసు. మరెంత మనసున్న వాడివో కూడా తెలుసు.

ఎప్పుడూ ఇదే కొమ్మపైన కూర్చుంటావు. ఎందుకో నా కేసి చూడవు.

నా దాపులోకి రావు.

నాలో వున్న ఫలరసాన్ని గ్రోలాలని నీకు అనిపించిందా?

నువ్వు నన్ను ముక్కుతో పొడిచి పొడిచి ఆరగిస్తుంటే తన్మయత్వంతో పరవశించి పోవాలనీ, నేను నీకే సొంతం కావాలనీ ఆశ పడుతున్నాను.

కానీ నీకు సంకోచం . . . . భయం.

నువ్వు నన్ను ముడితే తోటమాలి నిన్ను బతకనివ్వడని భయం నీకు ఒద్దు.

నీకేం కాదు. రావయ్యా! నన్ను నీకు అర్పించుకుంటున్నాను.

రా . . . . రా . . . .

నన్ను కొంచెం కొరుక్కు తినవయ్యా!

★

*రచయిత సెల్: 9247179249*

## విమలారామన్ బాధ...

వయస్సు చిన్నదే అయినా ముదురు ముఖం కావడమే తన బ్యాడ్‌లక్ అని విమలారామన్ తెగ బాధపడిపోతోంది. "టాలీవుడ్‌లో టాప్ పొజిషన్‌లో ఉన్న హీరోయిన్లందరికన్నా వయస్సులో నేను చాలా చిన్నదాన్ని. అందరి హీరోల పక్కన నేను చక్కగా సరిపోతాను. కొందరు నేను ఆంటీలా కనిపిస్తానని అంటున్నారు కానీ, అది తప్పు. సీనియర్ హీరోల పక్కన చేస్తున్నానంటే, నా స్థాయి ఏమిటో అర్థం చేసుకోండి. కుర్ర హీరోల పక్కన ఎవరైనా చేయగలుగుతారు. సీనియర్స్ పక్కన చేయడమే గొప్ప" అంటూ గొప్పలు చెబుతోంది. అసలు విషయం అది కాదనీ, కుర్రహీరోల పక్కన విమలా రామన్ ఆంటీలా కనపడడంతో సీనియర్ హీరోల పక్కనే అవకాశాలు వస్తున్నాయని టాలీవుడ్ వర్గాలు అంటున్నాయి.



Printed and Published by **Vemuri Radhakrishna,** Managing Director, on behalf of Aamoda Publications Pvt. Ltd., Plot No.76, Aswani Layout, Huda Heights, Jubilee Hills, Hyderabad-500 033. Ph.(040) 23558233/44, Fax No.23558288. Printed at Aamoda Press, R.S.No.191/3, Ward No.43, Donka Road, Patamata, Vijayawada - 520 010, Reg.No.: APTEL/2004/12594. Editor: **A.N.JAGANNADHA SARMA**